https://epaper.tharangalu.in

జాతీయ దిన పత్రిక

తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

RNI. TELTEL / 2022 / 83463

హైదరాబాద్
గురువారం
26 మార్చి 2026
సంపుటి 03
సంచిక 167
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh    Epaper: www.tharangalu.in.com

తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460

## జాతీయ ఖనిజ అన్వేషణ ట్రస్ట్ సమావేశం.. కీలక నిర్ణయాలు

- ఎన్ఎంఈటి 7వ సాధారణ సమావేశానికి అధ్యక్షత వహించిన కిషన్ రెడ్డి
- క్రిటికల్ ఖనిజాల అన్వేషణపై దృష్టి

దేశ పరిశ్రమలు, ఇంధన రంగానికి మద్దతు లక్ష్యం



**న్యూఢిల్లీ, మార్చి 25 (తరంగాలు ప్రతినిధి):** జాతీయ ఖనిజ అన్వేషణ మరియు అభివృద్ధి ట్రస్ట్ (ఎన్ఎంఈటి) 7వ సాధారణ సమావేశం న్యూఢిల్లీలోని ఖనిజ్ కక్ష్‌లో నిర్వహించబడింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అధ్యక్షత వహించారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూవిజ్ఞాన శాఖల సహాయ మంత్రి జితేంద్ర సింగ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో దేశంలో క్రిటికల్ ఖనిజాల విలువ శృంఖలాన్ని బలోపేతం చేయడంలో ఎన్ఎంఈటి పాత్రపై విస్తృతంగా చర్చించారు. దేశవ్యాప్తంగా ఖనిజ అన్వేషణ కార్యకలాపాలను వేగవంతం చేయడం, కొత్త ఖనిజ వనరులను గుర్తించడం వంటి అంశాలపై దృష్టి సారించారు. భవిష్యత్ పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన కీలక ఖనిజాలను సమృద్ధిగా అందుబాటులోకి తీసుకురావడం అవసరమని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, శక్తి మార్పిడి రంగాల్లో ఉపయోగపడే ఖనిజాల అన్వేషణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

దేశంలో ఖనిజ అన్వేషణ

➤ మిగతా 2వ పేజిలో..



## యువత పాత్ర.. నవభారత నిర్మాణానికి దిక్సూచి

- యువశక్తి దేశ ప్రగతికి వెన్నెముక
- ఆర్థిక వ్యవస్థలో నూతన ఆవిష్కరణలు
- సామాజిక మార్పుకు యువతే ఆయుధం

**డెస్క్, మార్చి 25 (తరంగాలు ప్రతినిధి):** ఏ దేశాభివృద్ధికైనా ఆ దేశ యువతే వెన్నెముక వంటి వారు. భారతదేశం వంటి అత్యధిక యువజన జనాభా కలిగిన దేశంలో, ఈ శక్తిని సరైన దిశలో మళ్ళించడం ద్వారా అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చు. యువత కేవలం దేశ భవిష్యత్తు మాత్రమే కాదు, వారు దేశ వర్తమానానికి కూడా ఊపిరి వంటి వారు. వారిలో ఉండే ఉత్సాహం, నూతన ఆలోచనలు మరియు సాహసించే గుణం దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తాయి. నేటి గ్లోబల్ విలేజ్ యుగంలో, ప్రపంచంతో పోటీ పడాలంటే యువత తమ మేధస్సును, నైపుణ్యాన్ని దేశ ప్రయోజనాల కోసం వెచ్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ నుండి సామాజిక మార్పుల వరకు ప్రతి అంశంలో యువత సంతకం స్పష్టంగా కనిపిస్తోంది. ఆర్థికాభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమైనది. నేడు భారతదేశం స్టార్టప్ రంగంలో ప్రపంచంలోనే మూడవ స్థానంలో నిలవడానికి ప్రధాన కారణం యువ పారిశ్రామికవేత్తలే. కొత్త వ్యాపార ఆలోచనలతో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ, దేశ జీడీపీ వృద్ధికి వారు తోడ్పడుతున్నారు. కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలను సృష్టించే స్థాయికి యువత ఎదగడం ఒక శుభపరిణామం. వ్యవసాయం నుండి అంతరిక్ష పరిశోధనల వరకు ప్రతి రంగంలోనూ యువత తమదైన ముద్ర

➤ మిగతా 2వ పేజిలో..

## 'వందేమాతరం' సర్క్యులర్‌పై సుప్రీంకోర్టు స్పష్టత



- పిటిషన్ విచారణకు నిరాకరణ
- సర్క్యులర్ కేవలం సలహామాత్రమేనని వ్యాఖ్య
- తప్పనిసరి కాకపోతే జోక్యం అవసరం లేదని కోర్టు అభిప్రాయం

**న్యూఢిల్లీ, మార్చి 25 (తరంగాలు ప్రతినిధి):** ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో 'వందేమాతరం' గేయాన్ని పాడాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణకు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహాపూర్వకమైనదే తప్ప అది తప్పనిసరి కాదని స్పష్టంచేసింది. శిక్షార్హమైన నిబంధనలు లేకపోవడంతో ఈ దశలో జోక్యం అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్

➤ మిగతా 2వ పేజిలో..

## ప్రియుడి కోసం తల్లిని హతమార్చిన కూతురు





- ఏడాది తర్వాత వెలుగులోకి వచ్చిన దారుణం
- బైక్ అమ్మకానికి వెళ్లడంతో బయటపడిన నిజం
- ప్రేమ వ్యవహారమే హత్యకు కారణమని పోలీసుల వెల్లడి

➤ 2వ పేజిలో..

## నేతన్నల సమస్యలపై కేటీఆర్ వినతి

- విద్యుత్ బిల్లుల భారం మాఫీ చేయాలని డిమాండ్
- ఉప ముఖ్యమంత్రి, మంత్రులతో కేటీఆర్ భేటీ
- నేతన్నల జీవనోపాధి ప్రమాదంలో ఉందని ఆందోళన



**హైదరాబాద్, మార్చి 25 (తరంగాలు ప్రతినిధి):** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న విద్యుత్ సంక్షోభం నుంచి నేతన్నలను రక్షించాలని కోరుతూ కేటీఆర్ కీలకంగా ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులను కలిసి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. పవర్‌లూమ్ యూనిట్లపై పెరిగిన

➤ మిగతా 2వ పేజిలో..

## ప్రియుడి కోసం భర్తను హతమార్చిన భార్య

- పది రోజుల్లో మిస్టరీ ఛేదించిన పోలీసులు
- నలుగురు నిందితులు అరెస్ట్
- రెండు చిన్నారులు అనాథలుగా మారిన దుర్ఘటన



**బనగానపల్లె, మార్చి 25(తరంగాలు ప్రతినిధి):** నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం కైప

➤ మిగతా 2వ పేజిలో..



## ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే బడ్జెట్: భట్టి విక్రమార్క

- యువత, రైతులు, పేదల సంక్షేమమే కేంద్రబిందువు
- ఆర్థిక క్రమశిక్షణతో సమగ్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం
- ప్రతిపక్షాలకు నిర్మాణాత్మక సహకారం కోరిన ఉప ముఖ్యమంత్రి

**హైదరాబాద్, మార్చి 25 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ అనేది కేవలం అంకెలు, గణాంకాలు మాత్రమే కాదని, అది ప్రజల ఆశలు, ఆకాంక్షలు, భవిష్యత్తుకు బాటలు వేసే పథక పటమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రతి వర్గానికి న్యాయం చేయడం, సమగ్ర అభివృద్ధి సాధించడమే

➤ మిగతా 2వ పేజిలో..

# కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి రాజీనామా

- హైకమాండ్, సీఎం తీరుపై తీవ్ర విమర్శలు
- ఫిరాయింపుల ప్రోత్సాహంపై అసంతృప్తి వ్యక్తం
- బుజ్జగింపులు ఫలించకపోవడంతో నిర్ణయానికి కట్టుబాటు



**జగిత్యాల, మార్చి 25 ( తరంగాలు ప్రతినిధి)::** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. జగిత్యాలలో కార్యకర్తల సమక్షంలో తన రాజీనామా లేఖను విడుదల చేసిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ హైకమాండ్ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. గత 20 నెలలుగా పార్టీలో తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నానని జీవన్ రెడ్డి వెల్లడించారు. గౌరవం లేని చోట కొనసాగడం సాధ్యం కాకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ లోపల తనకు సరైన ప్రాధాన్యత లభించలేదని, తన భావాలను పట్టించుకోలేదని ఆరోపించారు.

తెలంగాణలో ఫిరాయింపులను ప్రోత్సహించడం పార్టీ విధానాలకు విరుద్ధమని జీవన్ రెడ్డి మండిపడ్డారు. ముఖ్యంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పార్టీలోకి తీసుకోవడం, ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పక్కన పెట్టి, కొత్తగా వచ్చిన వారికి ప్రాముఖ్యత ఇస్తున్నారని విమర్శించారు. తనకు అండగా ఉన్న కీలక నాయకుడు మరణించిన సమయంలో ముఖ్యమంత్రి పరామర్శించలేదని, తనకు మద్దతుగా నిలబడలేదని జీవన్ రెడ్డి ఆరోపించారు. ఈ కారణాల వల్లే పార్టీపై నమ్మకం కోల్పోయానని, ఇకపై రేవంత్ రెడ్డి విధానాలపైనే తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.మరోవైపు, జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చివరి వరకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. జీవన్ రెడ్డి తన నిర్ణయానికే కట్టుబడి ఉండగా, జగిత్యాల నియోజకవర్గంలో ఆయనకు ఉన్న బలమైన కేడర్ ఇప్పుడు ఆయన వెంట నడిచే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
గురువారం, 26 మార్చి, 2026


## జాతీయ ఖనిజ అన్వేషణ ట్రస్ట్ సమావేశం.. కీలక నిర్ణయాలు

➢ మొదటి పేజీ తరువాయి

వేగాన్ని పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. పరిశోధన, అన్వేషణ రంగాల్లో పెట్టుబడులను పెంచడం ద్వారా ఖనిజ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశం ద్వారా దేశ పరిశ్రమల వృద్ధి, ఇంధన భద్రతకు అవసరమైన ఖనిజ వనరుల అభివృద్ధికి దిశానిర్దేశం లభించిందని అధికారులు తెలిపారు. ఎన్ఎంఈటి ద్వారా ఖనిజ రంగంలో మరింత పురోగతి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు.

## ‘వందేమాతరం’ సర్క్యులర్‌పై సుప్రీంకోర్టు స్పష్టత

➢ మొదటి పేజీ తరువాయి

నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను పరిశీలించింది. జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలిలతో కూడిన ఈ బెంచ్, కేంద్రం జనవరి 28న జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఎక్కడా శిక్షలు లేదా బలవంతపు నిబంధనలు లేవని పేర్కొంది. అందువల్ల దీనిపై తక్షణ విచారణ అవసరం లేదని అభిప్రాయపడింది.

ఒకవేళ భవిష్యత్తులో ఈ సర్క్యులర్‌ను తప్పనిసరి చేసి, పాటించనివారిపై చర్యలు తీసుకుంటే అప్పుడు కోర్టు జోక్యం చేసుకునే అవకాశముందని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపింది. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, ఈ సర్క్యులర్ పరోక్ష ఒత్తిడికి దారితీసే ప్రమాదం ఉందని వాదించారు. ‘వందేమాతరం’ పాడకపోతే లేదా గౌరవ సూచకంగా నిలబడకపోతే సామాజిక వివక్ష ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశభక్తిని బలవంతంగా రుద్దలేమని, వ్యక్తిగత స్వేచ్ఛను రాజ్యాంగం కాపాడాలని ఆయన పేర్కొన్నారు.అయితే ఈ వాదనలను కోర్టు ఊహాజనితంగా భావించింది. ఎవరిపైనైనా శిక్షార్హ చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని పిటిషనర్‌కు సూచించింది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను తిరస్కరించింది. కేంద్రం జారీ చేసిన సర్క్యులర్‌లో విద్యాసంస్థలు, బహిరంగ కార్యక్రమాల్లో ‘వందేమాతరం’ గేయాన్ని ఆలపించాలని సూచించినప్పటికీ, అది కేవలం గౌరవాన్ని పెంపొందించడానికే ఉద్దేశించినదని ప్రభుత్వం స్పష్టం చేసింది. స్వాతంత్ర్య సమరంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిన ఈ గేయానికి ప్రత్యేక స్థానం ఉందని ప్రభుత్వం పేర్కొంది.

## నేతన్నల సమస్యలపై కేటీఆర్ వినతి

➢ మొదటి పేజీ తరువాయి



విద్యుత్ బకాయిలు, సర్‌చార్జిల భారాన్ని తగ్గించాలని కోరారు. సిరిసిల్లలోని పవర్‌లూమ్ యూనిట్లపై విధించిన ‘బ్యాక్ బిల్లింగ్’ కారణంగా పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడిందని కేటీఆర్ వివరించారు. గత ప్రభుత్వ కాలంలో 25 హెచ్‌పి వరకు విద్యుత్ సబ్సిడీ అందించడంతో పరిశ్రమ నిలదొక్కుకున్నదని, కానీ ప్రస్తుతం విధిస్తున్న అదనపు బిల్లుల వల్ల పరిస్థితి క్షీణించిందని తెలిపారు. 2016 నుండి 2024 మధ్య కాలానికి సంబంధించిన సుమారు 127 చిన్న పరిశ్రమ యూనిట్లపై అధికారులు రూ. 19 కోట్ల బ్యాక్ బిల్లింగ్ విధించగా, సర్‌చార్జిలతో కలిపి అది రూ. 38 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఈ భారీ భారం కారణంగా యూనిట్లు ఆర్థికంగా నిలదొక్కుకోలేకపోతున్నాయని చెప్పారు.

ఈ పరిస్థితుల్లో అనేక పవర్‌లూమ్ యూనిట్లు మూతపడటంతో పాటు వేలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో 13 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని తెలిపారు. మానవీయ కోణంలో ఈ విద్యుత్ బిల్లుల భారాన్ని పూర్తిగా రద్దు చేసి సిరిసిల్ల నేతన్నలను ఆదుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. పరిశ్రమను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రియుడి కోసం తల్లిని హతమార్చిన కూతురు

**హైదరాబాద్, మార్చి 25(తరంగాలు ప్రతినిధి):** మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ పరిధిలో ఏడాది క్రితం జరిగిన ఓ మహిళ అదృశ్య ఘటన ఇప్పుడు హత్య కేసుగా బయటపడింది. తన ప్రియుడి కోసం తల్లినే హతమార్చిన కూతురు ఘటన సంచలనంగా మారింది. మే 2025లో మంజు అనే మహిళ కనిపించడం లేదని, ఆమె బైక్ కూడా కనిపించడం లేదని ఆమె పెద్ద కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో పోలీసులు అనేక కోణాల్లో దర్యాప్తు చేపట్టినప్పటికీ ఎలాంటి స్పష్టమైన ఆధారాలు లభించలేదు. దీంతో మంజు ఆచూకీ గుట్టు వీడకపోయింది. కేసు నిలిచిపోయినట్లే కనిపించినప్పటికీ తాజాగా జరిగిన ఒక సంఘటనతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.



ఇటీవల మంజుకు చెందిన బైక్‌ను రాంకోఠిలోని ఒక దుకాణంలో అమ్మేందుకు మౌంటీ రాజ్‌పుత్ అనే వ్యక్తి వెళ్లాడు. అతను ఇచ్చిన సమాధానాలు అనుమానాస్పదంగా ఉండటంతో షాపు యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు రాజ్‌పుత్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు.

విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. మంజు చిన్న కూతురు ఇషికాతో తాను ప్రేమలో ఉన్నానని, తమ సంబంధాన్ని మంజు అంగీకరించకపోవడంతో ఆమెను ఇద్దరం కలిసి హత్య చేశామని రాజ్‌పుత్ ఒప్పుకున్నాడు. హత్య అనంతరం ఈ విషయం బయటపడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు వెల్లడించారు. తన తల్లిని హతమార్చిన తర్వాత ఏడాది పాటు ఏమీ తెలియనట్లుగా ఇషికా నటించిందని పోలీసులు తెలిపారు. చివరకు బైక్ అమ్మకానికి వెళ్లిన సమయంలో అనుమానం రావడంతో కేసు బయటపడిందని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

# యువత పాత్ర.. నవభారత నిర్మాణానికి దిక్సూచి

➢ మొదటి పేజీ తరువాయి



వేస్తున్నారు. డిజిటల్ విప్లవాన్ని అందిపుచ్చుకొని, మారుమూల గ్రామాలకు కూడా సేవలను చేరువ చేయడంలో యువ సాంకేతిక నిపుణుల కృషి అనిర్వచనీయం. ఆర్థిక స్వయం సమృద్ధి సాధించడమే నవభారత లక్ష్యం కావాలి.సాంకేతిక పరిజ్ఞానం మరియు ఆవిష్కరణలలో యువత చూపిస్తున్న చొరవ అసాధారణమైనది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చైన్, రోబోటిక్స్ వంటి అత్యాధునిక రంగాలలో భారతీయ యువత ప్రపంచ స్థాయి సంస్థలను శాసిస్తోంది. ఈ నైపుణ్యాన్ని స్వదేశీ అవసరాలకు అనుగుణంగా మలచుకున్నప్పుడే దేశం నిజమైన అభివృద్ధిని సాధిస్తుంది. ‘మేక్ ఇన్ ఇండియా’ వంటి పథకాలను విజయవంతం చేయడంలో యువ ఇంజనీర్లు, శాస్త్రవేత్తల పాత్ర మరువలేనిది. గ్రామీణ సమస్యలకు తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారాలను కనుగొనడం ద్వారా వారు సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. సాంకేతికతను కేవలం వినోదం కోసం కాకుండా, విజ్ఞానం మరియు వికాసం కోసం వాడుకున్నప్పుడే జాతి గర్విస్తుంది. సామాజిక మార్పులకు యువత ఒక శక్తివంతమైన సాధనం. సమాజంలో పేరుకుపోయిన మూఢనమ్మకాలు, కులమత వైషమ్యాలు మరియు లింగ వివక్షకు వ్యతిరేకంగా యువత గొంతు ఎత్తాలి. సామాజిక స్పృహ కలిగిన యువత ఉన్నప్పుడే చట్టాలు సక్రమంగా అమలవుతాయి. స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొంటూ, పర్యావరణ పరిరక్షణ కోసం నడుం బిగించడం వారి బాధ్యతను తెలియజేస్తోంది. రక్తదానం, అక్షరాస్యత ప్రచారం మరియు ప్రకృతి వైపరీత్యాల సమయంలో వారు చూపే సేవా గుణం అభినందనీయం. సమాజంలోని అన్యాయాలను ప్రశ్నించే తత్వం, బాధితులకు అండగా నిలిచే ధైర్యం యువతకు ఆభరణాలు. నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో వారిదే అగ్రతాంబూలం.

రాజకీయాల్లో యువత ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉంది. దేశ విధాన రూపకల్పనలో యువత ఆలోచనలకు చోటు దక్కినప్పుడే అవి వాస్తవికతకు దగ్గరగా ఉంటాయి. కేవలం ఓటర్లుగానే కాకుండా, చట్టసభల్లోకి యువ రక్తం ప్రవేశించడం ద్వారా పాలనలో పారదర్శకత, వేగం పెరుగుతాయి. అవినీతి రహిత రాజకీయాల కోసం యువత పోరాడాలి. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో మరియు రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవడంలో వారు ముందుండాలి. యువ నాయకత్వం వల్ల దేశానికి కొత్త ఉత్సాహం, సరికొత్త విజన్ లభిస్తుంది. రాజకీయాలను ఒక సేవగా భావించే తరం వచ్చినప్పుడే దేశ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవడం మొదటి అడుగు కావాలి. విద్య మరియు నైపుణ్యాభివృద్ధి యువతకు శక్తినిచ్చే ఆయుధాలు. నేటి పోటీ ప్రపంచంలో నెగ్గుకురావాలంటే నిరంతరం నేర్చుకునే తత్వం ఉండాలి. కేవలం డిగ్రీలు సంపాదించడం కాకుండా, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ప్రభుత్వం కల్పిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను సద్వినియోగం చేసుకోవాలి. విదేశాల్లో విద్యనభ్యసించినా, తమ మేధస్సును మాతృభూమి సేవకు అంకితం చేసే ధోరణి పెరగాలి. జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతున్న తరుణంలో, యువత తమను తాము ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దుకోవాలి. ఉన్నత చదువులు చదివి ఉన్నత ఆశయాల కోసం జీవించడమే నిజమైన దేశభక్తి. అప్పుడే మనం ‘విశ్వగురువు’గా అవతరించగలం. నిరంతర అభ్యాసమే విజయానికి సోపానం.

పర్యావరణ పరిరక్షణ మరియు సుస్థిర అభివృద్ధిలో యువత పాత్ర మరువలేనిది. గ్లోబల్ వార్మింగ్ వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి యువత నూతన పద్ధతులను అనుసరించాలి. మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ నివారణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. పునరుత్పాదక ఇంధన వనరుల వాడకాన్ని ప్రోత్సహించడంలో యువ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలి. ప్రకృతిని కాపాడుకోవడం అంటే మనల్ని మనం కాపాడుకోవడమే అనే సత్యాన్ని యువత గ్రహించాలి. సుస్థిరమైన భవిష్యత్తు కోసం నేడే పునాదులు వేయాలి. పర్యావరణ హితమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా వారు రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలి. భూమిని రక్షించడం అనేది ఒక ఫ్యాషన్ కాదు, అది ఒక పవిత్ర కర్తవ్యం. భారతదేశం ఒక యువ దేశం. ఈ ‘డెమోగ్రాఫిక్ డివిడెండ్’ను మనం సరిగ్గా వాడుకుంటే, 2047 నాటికి భారత్ వికసిత దేశంగా మారడం ఖాయం. యువత తమలోని శక్తిని గుర్తించి, లక్ష్యం వైపు పయనించాలి. స్వామి వివేకానంద చెప్పినట్లు “లేవండి, మేల్కొనండి, గమ్యం చేరే వరకు విశ్రమించకండి” అనే సూక్తి యువతకు స్ఫూర్తి కావాలి. దేశాభివృద్ధి అంటే కేవలం అంకెలు పెరగడం కాదు, ప్రతి పౌరుడి జీవితంలో వెలుగు నిండటం. ఆ వెలుగును నింపే బాధ్యత యువత భుజాలపై ఉంది. మీ ప్రతి ఆలోచన, ప్రతి అడుగు దేశాభివృద్ధికి ఇంధనం కావాలి. మనం బాగుంటేనే దేశం బాగుంటుంది. యువత మేల్కొంటేనే నవ భారతం సాధ్యమవుతుంది.

# ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే బడ్జెట్: భట్టి విక్రమార్క

➢ మొదటి పేజీ తరువాయి

ఈ బడ్జెట్ లక్ష్యమని స్పష్టం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి కలలకు వేదిక కల్పించడం ఈ బడ్జెట్ ప్రధాన ఉద్దేశమని భట్టి విక్రమార్క తెలిపారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల ప్రోత్సాహం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అదే విధంగా పేదలకు గృహ వసతి, ఆరోగ్య సదుపాయాలు, సామాజిక భద్రత కల్పించడంపై కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరించారు.

రైతు సంక్షేమం ఈ బడ్జెట్‌లో కీలక అంశమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయానికి మద్దతు, పంటలకు సరైన ధరల కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతుల ఆర్థిక స్థిరత్వం పెరిగితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, నీటి వనరుల వినియోగం, వ్యవసాయ మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో ఏర్పడిన లోపాలను సరిదిద్దడం ఈ బడ్జెట్ ముఖ్య లక్షణమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అర్భాటాలకు పోకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, ఖర్చులను సమర్థంగా నియంత్రిస్తూ అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. సామాన్యుడిపై పన్నుల భారం మోపకుండా వనరులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా సమతుల అభివృద్ధి సాధించడమే లక్ష్యమని అన్నారు.

మహాత్మా గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పేదవాడి కన్నీరు తుడిచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సమగ్ర సంక్షేమం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని సుసంపన్నమైన, సమానత్వం కలిగిన సమాజంగా తీర్చిదిద్దే దిశగా పునాది వేస్తుందని చెప్పారు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క వివరించారు. అప్పులు, ఆదాయాలు, ఖర్చులను సమన్వయం చేస్తూ దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం సాధించడంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. వనరుల సమర్థ వినియోగం ద్వారా ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతిపక్షాలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, వాటిని నిర్మాణాత్మక సూచనలుగా మార్చి ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి అనేది అన్ని పార్టీల సామూహిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ తెలంగాణ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే సమగ్ర ప్రణాళికగా నిలుస్తుందని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. యువత, రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజల అవసరాలను సమన్వయం చేస్తూ రూపొందించిన ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రియుడి కోసం భర్తను హతమార్చిన భార్య

➢ మొదటి పేజీ తరువాయి

గ్రామ సమీపంలో జరిగిన హత్య కేసును పోలీసులు పది రోజుల్లో ఛేదించారు. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య సహా నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 16న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనబడటంతో కేసు నమోదైంది. మృతుడు డోన్‌కు చెందిన గోరిళ్ల విల్సన్ అని అతని తల్లి ప్రమీలమ్మ ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును సవాలుగా తీసుకున్న బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథరెడ్డి, నందివర్గం ఎస్ఐ భూపాలుడు తమ బృందంతో కలిసి విచారణ చేపట్టారు. దర్యాప్తులో మృతుడి భార్య మేరీకి మధు అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నట్లు బయటపడింది. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. భర్త వేధింపులు పెరగడంతో అతన్ని తొలగించుకోవాలని మేరీ తన ప్రియుడు మధుతో కలిసి కుట్ర పన్నారు.

పథకం ప్రకారం మేరీ, మధు, వారి స్నేహితులు అశోకు, రఫీ కలిసి విల్సన్‌ను నంద్యాలకు తీసుకెళ్తున్నట్లు నమ్మించి ఆటోలో తీసుకెళ్లారు. బనగానపల్లె సమీపంలోని కైప గ్రామం వద్ద అర్ధరాత్రి సమయంలో అతని మెడకు బెల్టు బిగించి, బండరాళ్లతో దాడి చేసి హత్య చేశారు. హత్య అనంతరం మృతదేహాన్ని కాల్చివేయాలని ప్రయత్నించినా, అనుమానం వస్తుందని భావించి అక్కడే వదిలి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. సాంకేతిక ఆధారాలు, దర్యాప్తుతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు.ఈ ఘటనతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. మృతుడి పదేళ్ల కుమార్తె, నాలుగేళ్ల కుమారుడు అనాథలుగా మారడం స్థానికంగా కలకలం రేపింది. కేసు పై మరింత దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తి చేస్తాం

- **స్వాధీనం చేసుకోని ఇళ్లకు కొత్తవారికి కేటాయిస్తాం**
- **ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో చర్చలో మంత్రి పొంగులేటి**



హైదరాబాద్,మార్చి25 గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. శాసనసభలో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్దిదారులు స్వాధీనం చేసుకోలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్దిదారులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, అందులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్దిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్దిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

## సమీకృత వ్యవసాయ విధానంపై శిక్షణ

- లాభాదాయకమైన పంటల సాగు చేసి రైతుల అభివృద్ధి చెందాలి
- మహబూబాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచారకులు అజ్మీర శ్రీనివాసరావు



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మార్చి. 25, తరంగాలు:**
కేసముద్రం మండల రైతు వేదిక యందు కేసముద్రం మండల రైతులకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన సంస్థ( ఆత్మ)మహబూబాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ మరియు దాని అనుబంధ అయినా పశు సంవర్ధక శాఖ, ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమల శాఖ, ఆయిల్ పేడ్ వారి ఆధ్వర్యంలో కేసముద్రం మండలంలో రైతులకు, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం మీద, ఆయిల్ ఫామ్ తోటల సాగు, మల్బరీ సాగు, పాడి పరిశ్రమల అభివృద్ధి డైరీ కోళ్ల పెంపకం మీద, సమీకృత వ్యవసాయ విధానం మీద శిక్షణ ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహబూబాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచారకులు అజ్మీర శ్రీనివాసరావు, మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల మీద పూర్తిగా అవగాహన కలిగించుకొని వ్యవసాయంలో సమీకృత వ్యవసాయ విధానాన్ని అవలంబించి సాగులో ఖర్చులను తగ్గించి మంచి లాభదాయకమైన పంటల సాగు చేసి రైతులు అభివృద్ధి చెందాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో ఆయిల్ఫెడ్ శాఖ డివిజన్ అధికారి, మండల వ్యవసాయ అధికారి కేసంద్రం బి వెంకన్న, మరియు సెరికల్చర్ అధికారి, సారయ్య, పశు సంవర్ధక శాఖ అధికారులు, అభ్యుదయ రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, ముదిగిరి చిన్న సాంబయ్య , జాటోత్ రమేష్, మిట్టగడుపుల యాకూబ్, ఖాదర్, బొబ్బల యాకూబ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సి కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకై ఆన్ లైన్ దరఖాస్తు గడువు పెంపు



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మార్చి. 25, తరంగాలు:**
జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లి., మహబూబాబాద్ జిల్లా ద్వారా 2025-26 సం. నకు స్వయం ఉపాధి పథకాలకై ఆన్ లైన్ దరఖాస్తు గడువు తేది 02-04-2026 వరకు పొడిగించనైనదని ఎస్సీ కార్పోరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్హులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన యువతీ/యువకులు సంబందిత కుల, ఆదాయ, నివాస దృవీకరణ పత్రాలు, ఆదార్ కార్డు, రేషన్ కార్డు, పాస్ పోర్ట్ సైజు పోటో, పట్టాదారు పాసు పుస్తకం (వ్యవసాయ రంగం యూనిట్లకు), శాశ్వత (డ్రైవింగ్ లైసెన్సు (రవాణా రంగం యూనిట్లకు) తదితర ధృవ పత్రాలతో తేది.02-04-2026 వరకు ఆన్ లైన్ లో నమోదు చేసుకోగలరని ఇట్టి పథకముల వివరాల కోసం (www.tgobmms.cgg.gov.in), వెబ్ సైట్ ని సందర్శించగలరని. ఈ అవకాశాన్ని అర్హులైన ఎస్సి నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా అధికారి కోరారు.

## ఇల్లందు ఆర్టీసీ డిపో వద్ద సిఐటియు ధర్నా

- విద్యుత్ బస్సులను ఆర్టీసీ కే ఇవ్వాలి




**ఇల్లందు ప్రతినిధి మార్చి 25,( తరంగాలు):**
ఇల్లందు ఆర్టీసీ డిపో వద్ద, విద్యుత్ బస్సులను ఆర్టీసీ కే ఇచ్చి ఆర్టీసీని బలోపేతం చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్సుల విధానంలో మార్పు చేయాలని, జిసిసి పద్ధతిని రద్దు చేయాలని, ప్రైవేటు సంస్థలకు ఇస్తున్న అన్ని సబ్సిడీలను ఆర్టీసీకి ఇవ్వాలని, ఆర్టీసీలే నేరుగా విద్యుత్ బస్సులు సమకూర్చుకునేందుకు అవకాశం ఇవ్వాలని తెలిపారు. అలాగే బడ్జెట్లో సరిపడ నిధులు కేటాయించాలని, ఆర్టీసీ బస్సుల ఆపరేషన్ ఖర్చుకు ఆదాయానికి మధ్య వ్యత్యాసాన్ని (వయోబిలిటీ గ్యాప్ ఫండ్) ను ఆర్టీసీకి ఇవ్వాలని, విద్యుత్ బస్సులో బాడీ ఫ్యాబ్రికేషన్ ఆర్టీసీ వర్క్ షాప్ లలో చేయించాలని ఇందుకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజల అవసరాల మేరకు బస్సుల సంఖ్యను పెంచాలని, పిఎంఈ డ్రైవ్ పథకం లో ఇస్తున్న సబ్సిడీని ఆర్టీసీ చేసే రెట్రో ఫిట్మెంట్ బస్సులకు కూడా వర్తింపజేయాలని, ఆర్టీసీ కార్మికుల ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్ కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ అన్ని వెంటనే అందించాలని తదితర డిమాండ్లతో ఈ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో మన్యం మోహన్ రావు, కామ నాగరాజు,వెంకన్న, లక్ష్మణ్, పాసి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయం అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- నూతన భవనం, ప్రహరీగోడ నిర్మాణం సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలి

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
జిల్లా గ్రంథాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, పాఠకులకు, విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం స్థానిక బస్ డిపో రోడ్ లోని జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైబ్రరీ ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు భవనం, చుట్టూ ప్రహరీగోడ, టాయిలెట్ల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి కలెక్టర్



పరిశీలించారు. నిర్మితమవుతున్న నూతన రెండు అంతస్థుల భవనంతో పాటు విద్యార్థులకు, అభ్యర్థులు, పాఠకులకు కావాల్సిన వసతుల ఏర్పాట్లను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనుసంధానంగా ప్రహారీ గోడ, గేట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గ్రంథాలయంలోని రీడింగ్ రూమ్ లలో తిరుగుతూ కావాల్సిన వసతుల అవసరాలను కలెక్టర్ గుర్తించారు. అక్కడ ఉన్న పాఠకులతో, పోటీ పరీక్షలకు సిద్దం అవుతున్న అభ్యర్ధులతో జిల్లా కలెక్టర్ ముచ్చటించారు. ఏ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు, ఎటువంటి పుస్తకాలు కావాలి, ఏమైనా అవసరాలు కావాలా వివరాలు అందిస్తే పది రోజుల్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, యుద్ధ ప్రాతిపదికన లైబ్రరీ అదనపు భవనం, నిర్మాణ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అన్నారు. అభ్యర్దులు, విద్యార్థులకు అనువైన అధునిక వసతులతో చేపట్టిన నిర్మాణ పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించి ప్రతి సంవత్సరం అప్ డేట్ అయిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని, ఎప్పటికప్పుడు పాతవి మార్చాలని, పాఠకులు యువకులతో చర్చించి పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు ప్రతి విభాగం వారీగా అవసరమైన పుస్తకాల జాబితాను తయారు చేసి వెంటనే అందించాలని కలెక్టర్ గ్రంథాలయ నిర్వాహకులకు సూచించారు.



గ్రంథాలయంలో వివిధ రకాలైన పుస్తకాలు అన్ని రంగాల్లో రాణించే విధంగా కృషి చేసేందుకు దోహదపడుతాయని అన్నారు. కొత్త రకం ఛాలెంజ్ తో ప్రాక్టికల్ లర్నింగ్ ద్వారా ఆలోచన శక్తి పెంపొందించి పోటీ పరీక్షలకు ఉపయోగపడుతాయని తెలిపారు. లైబ్రరీ లోని పలు వార్తాపత్రికలు, సాహిత్యంతో విజ్ఞానాన్ని పొందవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా విద్యార్థులు, యువత గ్రంథాలయాల సేవలను ఉపయోగించుకుని తమ భవిష్యత్తును గమ్యాలను చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు, యువత విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా, అదే సమయాన్ని గ్రంథాలయంలో గడపడం ద్వారా కొత్త కొత్త విషయాలు, విజ్ఞానం పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది భాస్కర్ రావు, అఖిల్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

- ఖమ్మం నగరనాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులుయలమందల జగదీష్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**

ఖమ్మం కార్పొరేషన్ శ్రీనివాస్ నగర్ పరిధిలో లో నివాసముంటున్న నిరుపేద నాయి బ్రాహ్మణ వికలాంగుడైన తూముల శ్రీనివాస్ కులవృత్తిలో భాగంగా శ్రీనివాస్ నగర్ పెట్రోల్ బంకు పక్కన చిన్న డబ్బా షాపు పెట్టుకుని కులవృత్తి చేసుకుంటూతను భార్య ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత సంవత్సరం కాలము నుండి అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికి పరిమితమైయాడు. కుమారుడు చదువు మానేసుకుని మెడికల్ షాప్ లో పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన తండ్రి మరణంతో ఇబ్బందులు ఎదుర్కొంటూ న్న విషయం తెలుసుకున్న నాయి బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షులు,ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్ తను అందుబాటులో లేకున్నా తన తోటి మిత్రులు జర్నలిస్టువృత్తి లో పనిచేస్తున్న పొన్నబోయిన పానకాల రావు వుల్లోజు రమేష్ ల ద్వారా శ్రీనివాస్నగర్ లోని వారి



నివాసముంటున్న ఇంటి వద్దకు వెళ్లి వారికుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

# 30న జరిగే ధర్నా విజయవంతం చేయండి



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మార్చి. 25, తరంగాలు:**
మార్చి 30న లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడిబీసీ డబ్ల్యూఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడబోయిన శ్రీశైలం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేసముద్రం మండల కేంద్రంలో ముల్క మురళి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల కార్మికులు పెద్ద ఎత్తున హాజరై హైదరాబాదులో కమిషనర్ ఆఫీసు ముందు జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోస్టల్ ఆవిష్కరణ చేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి తాడబోయిన శ్రీశైలం మండల, అధ్యక్షులు మొలక మురళి ఈసందర్భంగా మండల కేంద్రంలో ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు నిధులను లేబర్ ఆఫీసుల ద్వారా కాకుండా జీవో 12 ద్వారా ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేశారని వాటిని సవరించి లేబర్ ఆఫీసుదార నష్టపరిహారాలు ఇవ్వాలని సిఎస్సి హెల్త్ టెస్టులు పేరుతో కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు . సిఎస్సి హెల్త్ టెస్టు ద్వారా కార్మికుల ఖజానాను కొన్ని కంపెనీలకు ఇప్పుడు ప్రభుత్వంలాభం చేకూర్చేలా చేస్తున్నారనిఇప్పటికైనా కంపెనీలకు ఇవ్వకుండా టెస్టులను రద్దు చేయాలని 60 సంవత్సరాలు నిండినటు వంటి కార్మికులకు నెలకు 5000 పెన్షన్ ఇవ్వాలని ప్రతి మండలంలో అడ్డా స్థలాలు కేటాయించి మరుగుదొడ్లు మంచినీటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్ ఇవ్వాలని అర్హులైనటువంటి కార్మికులకుఇల్లు నిర్మించుకోవడానికి రుణ సౌకర్యాలు కల్పించాలని గత ప్రభుత్వంకార్మికులకు ఆశ చూపిన మోటార్ సైకిల్ ను ఈ ప్రభుత్వం అయినా కార్మికులకు మోటార్ సైకిల్ తక్షణమే ఇవ్వాలని వారు కోరారు. కేసముద్రం ఇనుగుర్తిపెద్ద గూడూరు మండలాలను కలుపుకొని జిల్లాలో మూడో లేబర్ ఏ ఎల్ ఓ కార్యాలయాన్ని జిల్లాలోని కార్మిక అడ్వైజర్ కమిటీనిఏర్పాటు చేయాలని తాడబోయిన శ్రీశైలం డిమాండ్ చేశారు. 2009 నుండి రెన్యువల్ కానీతక్షణమే నిర్మల్ చేయాలని వెల్ఫేర్ బోర్డు నిధులను దుర్వినియోగం కాకుండా చూడాలని ఇల్లులేని భవనం నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లువ్వాలని అన్నారు. కార్యక్రమంలో గుగులోతు రవి బాల్ సింగ్ వీరన్న మంగీలాల్ జి శ్రీనివాస్ ఎం వెంకన్న సిహెచ్ కట్టయ్య ఉప్పలయ్య రామ్మూర్తి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి భువనేశ్వరి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి - గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

**తరంగాలు, మార్చి:25, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**
నర్సంపేట నియోజకవర్గం నర్సంపేట పట్టణ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి టీవీ విలేఖరి బుర్ర వేణు కుమార్తె భువనేశ్వరి ఇటీవల మరణించగా భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హాజరై చిన్నారి భువనేశ్వరి మృతి పట్ల సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, సీనియర్ నాయకులు దుగ్యాల సమ్మయ్య, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కొంకిస విగ్నేష్ గౌడ్, ఎస్టి మోర్చా నాయకులు బానోతు రాజేందర్, పట్టణ బిజెపి నాయకులు సామల ఇన్ కుమార్, తౌటం నిశాంత్, నాయకులు గోగుల సందీప్ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు మార్త సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
**తరంగాలు**
THARANGALU DAILY NEWS
గురువారం, 26 మార్చి, 2026


## సీ.సీ రోడ్లు వేసి నీళ్లు పోయించడం మరిచిన కాంట్రాక్టర్



**ఇల్లందు ప్రతినిధి మార్చ్ 25,( తరంగాలు):**
ఇల్లందు మండలం బాలాజీ నగర్ పంచాయితీ లోని పలువార్డులలో వేసిన సి.సి రోడ్లు నాసరికంగా వేశారని స్థానిక ప్రజలు వాపోయారు. సిమెంట్,ఇసుక,శాండ్ మిక్స్ ప్రొపోషన్ సరిగ్గా లేదని. సి.సి రోడ్ల వేసేటప్పుడు, స్థానిక అధికారులు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టం వచ్చిన రీతిగా రోడ్లు వేశారని మండిపడ్డారు. నాసరికంగా వేసింది కాకుండా కనీసం వేసిన సీ.సీ రోడ్లకు నీళ్లు పోయటం మరిచారని తెలిపారు. స్థానిక ఏ.ఈ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని వార్డుల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై నీళ్లు పోసేందుకు అయ్యే ఖర్చు కూడా మిగులు బాటుగా ఉంచేసుకుంటారేమో అంటూ ప్రశ్నిస్తున్నారు.వేసిన సీసీ రోడ్లు ను పరిశీలించిన తర్వాతనే బిల్లులు చెల్లించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఖమ్మం గ్రాండ్ గాయత్రి హోటల్ లో రన్ ఫర్ జీసస్, పీస్ ఆఫ్ వరల్డ్ కమిటీ సమావేశం

- **కమిటీని సమావేశపరిచిన పాస్టర్ రమేష్**



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
ఖమ్మం : ఏప్రిల్ 4వ తారీఖు జరగబోతున్న రన్ ఫర్ జీసస్ అలాగే ఫీస్ ఆఫ్ వరల్డ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఖమ్మం గ్రాండ్ గాయత్రి హోటల్లో కమిటీ సమావేశమైంది.గుడ్ ఫ్రైడే ఈస్టర్ పండుగలను కూడా జయప్రదంగా జరుపుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం లో ఉన్నటువంటి పాస్టర్స్ ఫెలోషిప్ పెద్దలు పాల్గొన్నారు. ఒక్కొక్కరి అభిప్రాయాలు తెలియజేస్తూ... రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని గొప్పగా నిర్వహించాలని, వేలాదిగా రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి ప్రజలు తరలివచ్చేలా గా చూడాలని, అలాగే ఇప్పుడు జరుగుతున్న ప్రపంచ పరిస్థితుల్లో ప్రపంచం ప్రశాంతంగా ఉండటానికి ప్రార్థనలు చేయాలని, దీనిలోనే ప్రపంచ శాంతి ర్యాలీని కూడా చేయాలని పెద్దలు నిర్ణయించారు. ప్రపంచ దేశాల మధ్య అశాంతి నెలకొన్న ఈ యొక్క బాధాకరమైన సమయంలో ప్రపంచం శాంతిగా ఉండాలని, ముఖ్యంగా మన భారతదేశం ప్రశాంతంగా ఉండాలని ప్రార్థన చేశారు. ఏప్రిల్ 4 వ తారీఖు జరుగుతున్న ర్యాలీలో కుల, మత, భేదం లేకుండా పాల్గొనవచ్చునని పెద్దలు ప్రేమ పూర్వకముగా ఆహ్వానిస్తున్నారు. ఖమ్మం, చుట్టుపక్క ఉన్న మండలాల ఆహ్వానిస్తున్నారు. రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఏప్రిల్ 4వ తారీఖు శనివారం ఉదయం 6 గంటలకు పెవిలియన్ గ్రౌండ్ లో ప్రారంభమై 9 గంటల వరకు సర్దార్ పటేల్ స్టేడియం ఎస్ ఆర్ అండ్ బి జీ ఎన్ ఆర్ కాలేజీ గ్రౌండ్ (ఎన్టీఆర్ సర్కిల్) వరకు ముగుస్తుందన్నారు.

## రేవంత్ రెడ్డి సర్కార్ అక్రమ అరెస్టులతో లంబాడీ పోరాటాన్ని ఆపలేరు

- **లంబాడీలతో పెట్టుకుంటే కాంగ్రెస్ పార్టీ భూస్థాపితమే లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్.**



**కల్వకుర్తి మార్చ్ 25 తరంగాలు ప్రతినిధి.**
కడ్తాల్ మండల కేంద్రంలో రాష్ట్ర లంబాడి హక్కుల పోరాట సమితి పిలుపు మేరకు కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ తెలంగాణ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహించడంజరిగింది.కడ్తాల్ పోలీసులు ఆయనను అక్రమంగా అరెస్టు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఎస్సీ ఎస్టీలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తాం.లంబాడీలను అడవులకే పరిమితం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదు కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తాం తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడ్జెట్ సమావేశంలో ఎస్సీ ఎస్టీల ప్రజలకు మోసం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన హామీలు ఘోరంగా విఫలం అయ్యాయని రాష్ట్ర లంబాడి హక్కుల పోరాట సమితి పిలుపు మేరకు తెలంగాణ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తే ముందస్తుగా కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తుగా కడ్తాల్ మండల పోలీసులు అరెస్టు చెయ్యడాన్ని తీవ్రంగా ఖండించారు.రేవంత్ రెడ్డి రాక్షస పాలన చేస్తున్నాడని తెలంగాణ రాష్ట్రంలో గత రెండేళ్ల కాంగ్రెస్ పాలన అంటే వంచన, దగా మరియు నమ్మక ద్రోహం రైతును నమ్మించి గొంతు కోశారన్నారు. మహిళలను అబద్ధాలతో మోసం చేశారు. యువత భవిష్యత్తును అగమ్య గోచరంగా మార్చారని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షన్ దార్ల ఆశలపై నీళ్లు చల్లారని,6 గ్యారంటీలు,13 డిక్లరేషన్లు, 420 వాగ్దానాలు ఏ ఒక్కటీ నెరవేర్చకుండా తెలంగాణ సమాజంలోని ప్రతీ వర్గాన్ని కాంగ్రెస్ నిలువునా వంచించిందని 100 రోజుల్లో స్వర్గం చూపిస్తామన్న హామీలు, నేడు అవినీతి, అరాచకం, కమీషన్ల రాజ్యం గా మారాయి అన్నారు. ప్రజా కంటక పాలన సాగిస్తున్న ఈ ప్రభుత్వంపై పోరాడేందుకు రాష్ట్ర లంబాడి హక్కుల పోరాట సమితి సన్నద్ధ మైందని కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ, అవినీతి సర్కార్ కు కనువిప్పు కలిగించేలా ప్రజల పక్షాన లంబాడి హక్కుల పోరాట సమితి రాజీలేని పోరాటం చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు సేవ్య నాయక్ రామ్ చందర్ నాయక్ శ్రీను నాయక్ మాజీ సర్పంచులు తులసి రామ్ నాయక్ శ్వేతా భూనాథ్ నాయక్ మాజీ ఉపసర్పంచ్ శారద పాండు నాయక్ నాయకులు ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు శీను నాయక్ దేవా నాయక్ మల్లేష్ నాయక్ భిక్య నాయక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర స్థాయి టి ఎం యు ఎన్ పోటీలకు ఎంపికైన కునూర్ విద్యార్థులు





**జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 25, (తరంగాలు ):**
స్థాయిలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు కుమారి అమూల్య నీలు లను గైడ్ టీచర్ సురేందర్ ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వజ్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు. వీరు భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. పి ఎం పాఠశాలల కార్యక్రమాలలో భాగంగా ఈ పోటీలను చౌడారం ఆదర్శ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్పెల్ బీ మరియు క్విజ్ పోటీల్లో కీర్తన మరియు నిత్య శ్రీ పాల్గొన్నారు.

# సీతారామచంద్ర స్వామి దేవాలయంలో మొదలైన తిరుకల్యాణ మహోత్సవ కార్యక్రమాలు

- **ఆలయ ప్రధాన అర్చకులు- పర్వతపు శివప్రసాద్ శాస్త్రి**
- **స్వామి వారి పెండ్లి పందిరి కార్యక్రమం వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్- దాసరి రమేష్**

**తరంగాలు, మార్చి:25, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**
ఖానాపురం మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో 27 మార్చి 2026 రోజున శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా నేడు ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రధాన అర్చకుడు పర్వతపు శివప్రసాద్ శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు ప్రారంభించి





ముత్తయిధువులచే పసుపు దంచుట, శ్రీరామ నవమి రోజు స్వామివారి కళ్యాణం సందర్భంగా స్వామివారి పెండ్లి పందిరి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి రమేష్, గ్రామ పెద్దలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ శ్రీరామ నవమి సందర్భంగా మన గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో రాముల వారి కళ్యాణం వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఇట్టి కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సీతారామచంద్రస్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సట్ల సుప్రజ, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మట్టి మాఫియాపై గ్రామస్తుల తిరుగుబాటు- లారీలను అడ్డుకున్న ప్రజలు

- **అధికారులు మౌనం... గుట్ట మాఫియా దౌర్జన్యం - కారేపల్లిలో ప్రశ్నలు పెరుగుతున్నాయి!**

కారేపల్లి టౌన్ /తరంగాలు న్యూస్ మార్చి 25
ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని గుట్ట గుంపు ప్రాంతంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై గ్రామస్తులు ఈరోజు ఆగ్రహం వ్యక్తం చేస్తూ భారీ స్థాయిలో నిరసనకు దిగారు. గుట్టను తవ్వి మట్టిని అక్రమంగా లారీల ద్వారా తరలిస్తున్న వారిని గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. మట్టి తవ్వకాలు బహిరంగంగా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తులు స్వయంగా రంగంలోకి దిగారు. లారీలను నిలిపివేసి డ్రైవర్లను ప్రశ్నించగా, "డబ్బులు పెట్టి మట్టి కొనుగోలు చేస్తున్నాం" అని సమాధానం ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ పెద్దలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు కలిసి ఈ అక్రమ తవ్వకాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గుట్టలు తవ్వడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతోందని, భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు.

**గ్రామస్తుల డిమాండ్లు:**

గుట్ట తవ్వకాలను వెంటనే నిలిపివేయాలి

అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలి

మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు తక్షణమే స్పందించాలి అయితే, పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ మండల రెవిన్యూ అధికారులు మరియు మైనింగ్ అధికారులు స్పందించక పోవడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



**"అధికారులు మౌనం... ప్రజలు చర్య!"**
ఈ ఘటనతో కారేపల్లి మండలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారా లేదా అనేది ఇప్పుడు కీలకంగా మారింది.ఈ ధర్నా లో గ్రామా ప్రజలు పాల్గొన్నారు

## దివ్యాంగులను ఆదుకోవాలి

- **దివ్యాంగుల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుంచం ఉప్పలయ్య విజ్ఞప్తి**
- **మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్‌కి వినతి**

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
ఖమ్మం : దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలని ఖమ్మం జిల్లా దివ్యాంగుల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుంచం ఉప్పలయ్య విజ్ఞప్తి చేశారు. ఉప్పలయ్య ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తనయుడు యుగేందర్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. దివ్యంగులకు ఖమ్మం జిల్లాలో గత 15 సంవత్సరముల నుండి ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్ లో సైకిల్, స్కూటర్ స్టాండ్ పార్కింగ్ ను "పట్టణ దివ్యంగుల సమైక్య" ఆధ్వర్యంలో నడుస్తుందని,ఈ పార్కింగ్ మీద 15 మంది దివ్యాంగల కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారని,ఈ సైకిల్ స్టాండ్ ను టెండర్ ద్వారా వికలాంగులకు ప్రైవేట్ ఏజెన్సీ వారికీ ఇవ్వటం జరిగిందని,సైకిల్ స్టాండ్ లో పనిచేస్తున్న దివ్యాంగులకు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు .దివ్యాంగుల కుటుంబాలు పిల్లలు రోడ్డుమీద పడకుండా ఆదుకోవాలని, దీనిలో పనిచేసే చాలామంది దివ్యాంగులకు ఇల్లు కూడా లేక, కిరాయి ఇంట్లో ఉంటున్నారని , ప్రభుత్వ హాస్పిటల్ లో సైకిల్ స్టాండ్ ను దివ్యంగులకు ఇప్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దివ్యంగుల ఆత్మీయ భవనం, మహిళలకు హాస్టల్ ఏర్పాటు చేయాలనీ, 10 సంత్సరాలుగా పెండింగ్ లో ఉన్న దివ్యంగుల బ్యాక్ లాగ్ రికట?్వరూట్మెంట్ నోటిఫికేషన్ ఇవ్వాల్ని కొరారు. ఈ కార్యక్రమం లో దోతుల చైతన్య ,కృష్ణయ్య, గండమల్ల అనంతలక్ష్మి , కాకటి భద్రకాళి , మార్తమ్మ , జాన్ బి ,నయీమ్ , అరుణ్ కుమార్ , తన్నేరు వెంకన్న , కోటి , భద్రం పాల్గొన్నారున్నారు.



## మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రాలు త్వరగా ఏర్పాటు చేయాలి

- మొక్కజొన్న మద్దతు ధర లేక భారీగా నష్టపోతున్న రైతులు- బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు - సంగని సూరయ్య



**తరంగాలు, మార్చి:25, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నెక్కొండ మండలం పరిధిలో మొక్కజొన్నలు కొనుగోలుకై మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడం వలన మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బి.ఆర్.ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య అన్నారు.మద్దతు ధర చేతికందక, కొనుగోలు కేంద్రాలు లేక ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడడంతో ప్రైవేటు వ్యాపారులు రైతుల వద్ద క్వింటాకు 1600 నుండి 1800 రూపాయల ధర వరకు మాత్రమే కొనుగోలు చేయడం వలన రైతులు భారీగా నష్టపోతున్నారని, ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి చొరవ తీసుకొని మార్క్ ఫెడ్ అధికారులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేసి మొక్కజొన్న రైతులను ఆదుకొని అండగా ఉండాలని, లేనిపక్షంలో బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ధర్నాలు నిర్వహిస్తామని సంగని సూరయ్య డిమాండ్ చేశారు.

## ప్రజాసేవ చేయడంలో తగ్గేదేలే అంటున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఉప్పల వెంకటేష్

- ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**కల్వకుర్తి.మార్చి 25 తరంగాలు ప్రతినిధి**

ఆమనగల్లు మున్సిపల్ పరిధిలోని 5వ నవచైతన్య కాలనీకి చెందిన ఈర్లపల్లి యాదమ్మ ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఉప్పల వెంకటేష్ చేయూతనందించారు. బుధవారం 5వ వార్డు కౌన్సిలర్, ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము స్లాబ్ పనులనుప్రారంభించారు.ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ5వ వార్డులోని పేదలను ఆదుకోవడమే లక్ష్యమని గూడు లేని నిరుపేదలకు చెందిన ఇండ్ల నిర్మాణానికి తన సహకారం ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వస్పుల సాయిలు,జంతుక కిరణ్, మాజీ ఎంపీటీసీ చలిచీమల యాదమ్మ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మల్లేష్, శ్రీను నాయక్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

## నరేందర్ రెడ్డి పార్థివ దేహానికి నివాళలు అర్పించిన స్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య



**జఫర్గఢ్ ప్రతినిధి, మార్చ్ 25,(తరంగాలు )**

స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్టేషన్ ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ చింతకుంట్ల నరేందర్ రెడ్డి అనారోగ్యంతో మరణించినందున వారి పార్థివ దేహాన్ని స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమాలలో అందుబాటులో ఉన్న ప్రజా ప్రతినిదులు , ముఖ్య నాయకులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యానికి హాజరైన వైస్ చైర్ పర్సన్ అల్లం రామ



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మార్చి.25, తరంగాలు:**

కేసముద్రం మున్సిపాలిటీ 13వ వార్డుకి చెందిన నాగనబోయిన వెంకటేశ్వర్లు-సునీతల కుమార్తె సృష్టి-శివ ప్రసాద్ ఎంగేజ్మెంట్ గణపతి ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన కేసముద్రం మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ-నాగేశ్వర్ రావు.

# ప్రకృతి ఇచ్చిన అమృత ధార ప్రాణం పోసే నీటి ధార

- భూగర్భజలాలను కాపాడుకుంటేనే భవిష్యత్తు భంగారుమయం
- భూగర్భ జల శాఖ షేర్ ఎన్జీవో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మార్చి.25, తరంగాలు:**

మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం, నాగారం గ్రామంలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా భూగర్భ జల శాఖ కార్యాలయం, మహబూబాబాద్ వారు, ఆశ్రిత సొసైటీ మహబూబాబాద్ సహకారంతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ జల అధికారి ఎం. అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కార్యక్రమానికి సిడబ్ల్యూసీ కమిటీ సభ్యుడు డా. డేవిడ్, అసిస్టెంట్ జియోఫిజిసిస్ట్ శ్రీనివాస్, అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్ట్ స్నేహ, అసిస్టెంట్ ఇంజనీర్ చేతన్, షేర్--జేఆర్సీ ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ వసుంధర, కమ్యూనిటీ మొబిలైజర్ రమేష్, మాజీ ఎంపీపీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి కిరణ్, సర్పంచ్ మరియు ఇతర గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా భూగర్భ జల అధికారి ఎం. అశోక్ మాట్లాడుతూ, ప్రపంచ జల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. నీటి వనరుల సంరక్షణ, సమర్థ వినియోగం మరియు భూగర్భ జలాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. నీటిని వృథా చేయకుండా, వర్షపు నీటిని సేకరించడం (రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్) ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని సూచించారు. ఇతర అధికారులు కూడా తమ ప్రసంగాలలో నీటి కొరత సమస్యలను వివరించి, గ్రామస్థులు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, చెరువులు, బావులు, కుంటలను సంరక్షించాలని సూచించారు. వ్యవసాయంలో నీటి ఆదా పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక విధానాలను అనుసరించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతులు మరియు అధికారులను సన్మానించారు. గ్రామ ప్రజలకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, నీటి పరిరక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడినందుకు నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు.





# డాక్టర్ వన్నాల వెంకటరమణను సన్మానించిన బిజెపి వర్ధన్నపేట మండల శాఖ



**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 25,తరంగాలు :**

భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ 2026 సమోరప్ (ముగింపు) కార్యక్రమం మండల అధ్యక్షురాలు కొండేటి అనిత అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి విచ్చేసిన డాక్టర్ వన్నాల వెంకటరమణ నూతనంగా బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన తర్వాత మొదటిసారి వర్ధన్నపేట మండలానికి విచ్చేసినందున వారిని మర్యాదపూర్వకంగ సన్మానించారు.ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను నాయకులను ఉద్దేశించి డాక్టర్ వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ జన సంఘం నుండి 1951 నుండి ఇప్పటివరకు దినదిన ప్రవర్తమానంగా ఎలా ఎదిగిందో అప్పటినుండి ఇప్పటివరకు పార్టీ ఎదుగుదలకు కృషి చేసిన నాయకుల గురించి కొనియాడారు.గతంలో బిజెపి నుండి మొట్టమొదటిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అటల్ బీహార్ వాజ్పేయి నుండి ఇప్పటి మన ప్రధాని నరేంద్ర మోడీ వరకు జాతీయ దృక్పథంతోని దేశమంతా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ సమాన భవంతో చూస్తూ దేశాన్ని ఐక్యతగా ఉంచుతూ వికసిత్ భారత్ గా మార్చేందుకు 2047 వరకు ప్రపంచంలోనే మన దేశాన్ని అగ్రగామి దేశంగా నిలబెట్టేందుకు దేశాన్ని ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇలాంటి పార్టీలో భాగమైనందుకు మనమందరం అదృష్టవంతులుగా భావిస్తూ మన వంతు కృషిగా నరేంద్ర మోడీ బాటలో నడుస్తూ పార్టీ సిద్ధాంతాలను అవగాహన చేసుకుని సుశిక్షితులైన కార్యకర్తలుగా ఈ శిక్షణలో నేర్చుకున్న ప్రతి దానిని ఆచరిస్తూ పార్టీని బలోపేతం చేయాలని రానున్న అసెంబ్లీ ఎలక్షన్లలో జిల్లాలోనే మన నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకోవాలని దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, జిల్లా కార్యదర్శి రాయపురపు కుమారస్వామి, ప్రశిక్షణ అభియాన్ సహ కన్వీనర్ గార్లపాటి మంజులారెడ్డి, ఎస్సీ మచ్చ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ మైసా రాములు, కట్రియాల సర్పంచ్ రాయపురం రమ్య/రాజు, నాంపల్లి యాకయ్య, తేజ నాయక్, అడుపరాజు, సోమిరెడ్డి, శ్రీరాముల సంపత్ ,నక్క రవి, గిరి మున్సిపాలిటీ ఎన్నికలలో కౌన్సిలర్ గా పోటీ చేసిన ప్రతి ఒక్కరు బూతు స్థాయి నుండి వివిధ స్థాయిలలో బాధ్యతలు గల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నాన్‌వెజ్ ప్రియులకు షాక్.. ఏప్రిల్ 1 నుంచి చికెన్ షాపులు బంద్!



**హైదరాబాద్, మార్చి 25 (తరంగాలు ప్రతినిధి):**

నగరంలో నాన్‌వెజ్ ప్రియులకు షాక్ ఇచ్చే పరిణామం చోటుచేసుకుంది. చికెన్ వ్యాపారులు భారీ నిర్ణయం తీసుకున్నారు. లాభాలు తగ్గిపోవడంతో ఏప్రిల్ 1 నుంచి హైదరాబాద్‌లో చికెన్ షాపులను బంద్ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే పలుచోట్ల ఈ విషయంపై పోస్టర్లు కనిపిస్తూ, పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు సరైన లాభ మార్జిన్లు ఇవ్వడం లేదని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ఖర్చులు, తగ్గుతున్న ఆదాయం కారణంగా షాపులు నడపడం కష్టంగా మారిందని వారు అంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ చికెన్ షాప్ యజమానుల సంఘం బంద్‌కు పిలుపునిస్తూ, లాభ మార్జిన్లు పెంచే వరకు ఈ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేసింది. దీంతో నగరంలో చికెన్ సరఫరాపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే గుడ్ల మార్కెట్‌లో మరో ఆసక్తికర పరిణామం కనిపిస్తోంది. ఇటీవలి రోజుల్లో గుడ్ల ధరలు భారీగా పడిపోయాయి. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో పశ్చిమ ఆసియా దేశాలకు ఎగుమతులు దెబ్బతినడంతో, స్థానిక మార్కెట్‌లో సరఫరా పెరిగింది. దీంతో ధరలు ఒక్కసారిగా క్షీణించాయి. ఒకవైపు చికెన్ షాపుల బంద్, మరోవైపు గుడ్ల ధరల పతనం -ఈ రెండు పరిణామాలు పౌల్ట్రీ రంగంపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి. వ్యాపారుల డిమాండ్లపై ప్రభుత్వం, సంబంధిత కంపెనీలు ఎలా స్పందిస్తాయన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే వినియోగదారులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఇంధన కొరతపై వస్తున్న వార్తలు కేవలం దుష్ప్రచారం

- ప్రజలు ఆందోళన చెందవద్దు
- బిజెపి రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి



**హనుమకొండ ప్రతినిధి, మార్చి 25,తరంగాలు :** రాష్ట్రంలో ఇంధన (పెట్రోల్, డీజిల్) కొరత ఉందంటూ సోషల్ మీడియాలో మరియు కొన్ని వర్గాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని బిజెపి రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ఇప్పటికే స్పష్టం చేసినట్లుగా, రాష్ట్రంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. కేవలం తప్పుడు ప్రచారాల వల్ల ప్రజలు ఒక్కసారిగా బంకుల వద్దకు రావడంతో తాత్కాలికంగా రద్దీ ఏర్పడుతోంది తప్ప, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఇంధన భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. రవాణా వ్యవస్థలో ఎక్కడా ఆటంకాలు కలగకుండా, సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా కేంద్రం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ప్రజలు ఇలాంటి పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దని, అవసరమైన మేరకే ఇంధనాన్ని కొనుగోలు చేస్తూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె కోరారు. రద్దీని పెంచి అనవసరమైన గందరగోళానికి దారి తీయవద్దని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కూడా తప్పుడు వార్తలు వ్యాప్తి చేసే వారిపై దృష్టి సారించాలని, ప్రజలకు వాస్తవాలను వివరించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు.

## యువతకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ

- ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో అందజేత



**వర్ధన్నపేట ప్రతినిధి,మార్చి 25, తరంగాలు :** నేటి ఆధునిక యుగంలో యువత కేవలం స్మార్ట్‌ఫోన్‌లకే పరిమితం కాకుండా, శారీరక దృఢత్వంపై దృష్టి సారించాలనే లక్ష్యంతో వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో శ్రీ ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య యువతకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువకుల్లో నైపుణ్యం పెంచేందుకు క్రీడలు దోహదపడతాయని,శారీరక దృఢత్వం తో పాటు యువకులు చేడు వ్యసనాలకు అలవాటు పడకుండా ఉంటారని నేటి సమాజంలో యువత మత్తు పదార్థాల కు, ఆన్లైన్ గేమ్ లకు అలవాటు పడి జీవితాలను అర్థాంతరంగా ముగిస్తున్నారని అన్నారు. యువతలో మార్పు రావాలంటే చదువు తో పాటు ఆటలల్లో కూడా రాణించాలని ప్రయత్నంలో భాగంగా శ్రీ ఛత్రపతి శివాజీ వంటి మహనీయుల పేరు మీద ఉన్న యూత్ అసోసియేషన్ ద్వారా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల యువతలో నాయకత్వ లక్షణాలు, దేశభక్తి క్రమశిక్షణ పెరుగుతాయని యువత ఖాళీ సమయాల్లో క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సర్పంచ్ సాంబయ్య యువతకు సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి యూత్ అధ్యక్షుడు జోగుల సంపత్,ఉపాధ్యక్షుడు బేతి ప్రసన్న,ప్రధాన కార్యదర్శి సట్ల అనిల్ గౌడ్,కోశాధికారి పెండోట మహంత్, గోపాల్, మంద శ్రీకాంత్, లవన్, శివాజీ, అఖిల్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గిన్నెలు.. ఆరోగ్యానికి సహజమైన ఎంపిక

- పూర్వకాల సంప్రదాయం మళ్లీ ప్రాచుర్యం
- ఆహారానికి ప్రత్యేక రుచి, పోషకాలు
- ఆరోగ్యానికి లాభాలు
- ప్లాస్టిక్, లోహాలకు ప్రత్యామ్నాయం



**ప్రాంతీయం, మార్చి 25తరంగాలు :ప్రతినిధి):** ఇటీవల కాలంలో మట్టి గిన్నెల వినియోగం మళ్లీ పెరుగుతోంది. ఒకప్పుడు ప్రతి ఇంట్లో కనిపించే ఈ గిన్నెలు, ఇప్పుడు ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో తిరిగి ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సహజ పదార్థాలతో తయారయ్యే మట్టి గిన్నెలు, ఆహారాన్ని సురక్షితంగా వండేందుకు ఉత్తమమైన ఎంపికగా భావించబడుతున్నాయి. మట్టి గిన్నెలలో వండిన ఆహారం ప్రత్యేక రుచిని అందిస్తుంది. మెల్లగా వండే ప్రక్రియ వల్ల పోషకాలు ఎక్కువగా నిల్వ ఉంటాయి. అలాగే, మట్టి గిన్నెలు వేడిని సమంగా పంచి, ఆహారాన్ని సాఫ్ట్‌గా, రుచిగా తయారు చేస్తాయి. పులుసులు, కూరలు, అన్నం వంటి వంటకాలకు ఇవి మరింత రుచిని తెస్తాయి. ఆరోగ్యపరంగా కూడా మట్టి గిన్నెలు అనేక ప్రయోజనాలను అందిస్తాయి. రసాయనాలు లేకుండా తయారవ్వడం వల్ల శరీరానికి హానికరం కాదు. అల్యూమినియం, ప్లాస్టిక్ పాత్రలతో పోలిస్తే మట్టి గిన్నెలు ఆరోగ్యానికి సురక్షితమైనవి. నీటిని కూడా మట్టి కుండలో నిల్వ చేస్తే సహజంగా చల్లబడుతుంది. పర్యావరణ పరిరక్షణలో కూడా మట్టి గిన్నెలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి పూర్తిగా సహజంగా కరిగిపోతాయి కాబట్టి కాలుష్యం తగ్గుతుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో ఇవి మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయి. సంప్రదాయాన్ని కాపాడుతూ, ఆరోగ్యాన్ని మెరుగుపరచాలంటే మట్టి గిన్నెల వినియోగాన్ని ప్రోత్సహించడం అవసరం.

# వార్డు మెంబర్‌పై సర్పంచ్ భర్త దాడి



**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 25,తరంగాలు :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని నల్లబెల్లి గ్రామ పంచాయితీ 12వార్డు మెంబర్ పై సర్పంచ్ భర్త దాడి చేసిన ఘటన వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో చోటుచేసుకుంది.భాదితులు పోలీసుల కథనం ప్రకారం గ్రామపంచాయతీ మీటింగ్ ఏర్పాటు చేసుకుని అభివృద్ధి పనుల తీర్మనం విషయంలో చర్చించారు. సమావేశం అనంతరం వార్డు మెంబర్లు బయటకు వెళ్లుతున్న క్రమంలో తీర్మనంలో విషయంలో వాగ్వాదం చేసుకోవడంతో 12 వార్డు మెంబర్ నాగరాజు పై సర్పంచ్ భర్త దాడి చేయడంతో వార్డు మెంబర్ ఈ సంఘటన పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్లు మాట్లాడుతూ నల్లబెల్లి గ్రామ సర్పంచ్ జక్కి అనిత భర్త జక్కి శ్రీకాంత్ ఆగడాలు రోజు రోజుకు ఎక్కువౌ తున్నాయన్నారు. గ్రామంలో జక్కి అనిత సర్పంచ్ గా అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటీ వరకు ముగ్గురు వార్డు మెంబర్లపై వారి కుటుంబాలపై దాడులకు దిగి రౌడియిజం చేస్తున్నారని గ్రామ వార్డు మెంబర్లు 12వ వార్డు మెంబర్ , 3 వ వార్డు సభ్యులు మరుపట్ల ప్రశాంత్ తెలిపారు. మంగళవారం గ్రామ పంచాయితీలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ మీటింగ్ లో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఊర చెరువు కట్టకు సంబంధించిన బిల్లు విషయంలో సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో తదువరి సమావేశంలో చర్చిద్దామని సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ విషయంలో సర్పంచ్ భర్త జక్కి శ్రీకాంత్ గ్రామ వంచాయితీలోకి వచ్చి సభ్యులను నానా బూతులు తిడుతూ 12వ వార్డు మెంబర్ అయిన నన్ను (ఆరెల్లి నాగరాజు) బిల్లు ఆగిపోవడానికి కారణం నువ్వే అంటూ తిడుతూ ఎందుకు తీర్మాణం చేయలేదంటూ గ్రామ పంచాయితీ ముందే భౌతిక దాడి చేశాడని తెలిపారు. ఎలాంటి కారణం లేకుండా గ్రామ పంచాయితీలో జనరల్ బాడీ సమావేశంలో పాల్గొంటున్న వార్డు సభ్యులను దాదీ చేసి బెదిరింపులకు పాల్పడిన గ్రామ సర్పంచ్ జక్కి అనిత భర్త జక్కి శ్రీకాంత్ ను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు నాగరాజు కోరారు. అదే విధంగా జనరల్ బాడి మీటింగ్ లోనే పాల్గొన్న మరో 3వ వార్డు సభ్యుడు మురుపట్ల ప్రశాంత్ ను సైతం జక్కి శ్రీకాంత్ గ్రామ పంచాయితీ ముందే దాడికి పాల్పడి ఎప్పటికైనా నిన్ను చంపుతానని హెచ్చిరిండంతో పాటు ఇష్టారాజ్యంగా దాడి చేసినట్లు ప్రశాంత్ తెలిపారు.దాంతో పాటు శ్రీకాంత్ ఇప్పటికే పలుమార్లు తనపై తన కుటుంబంపై దాడి చేసిన క్రమంలో ఒకసారి తన తల్లిపై హత్యాయత్నం చేశారని ప్రశాంత్ గుర్తు చేశారు.ఇప్పటికైనా పోలీసు అధికారులు తక్షణమే స్పందించి తనకు తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

# జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశం




**అనల్గొండ అర్బీ, మార్చ్ 25,తరంగాలు :** ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఉన్నందున బ్యాంకుల అనుసంధానంతో అమలు చేస్తున్న ప్రభుత్వ ప్రాధామ్య పథకాల తో పాటు, అన్ని పథకాల గ్రౌండింగ్ లక్ష్యాలను బ్యాంకర్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ కోరారు. బుధవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సెప్టెంబర్, డిసెంబర్ 2025 త్రైమాసిక లక్ష్యాల సాధనపై బ్యాంకుల నియంత్రణ అధికారులు, జిల్లా అధికారులతో సమీక్షించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ప్రజల అభివృద్ధికై ప్రభుత్వం పలు పథకాలను బ్యాంకుల సహకారంతో అమలు చేస్తున్నదని, ప్రత్యేకించి వ్యవసాయ రుణాలు ,చిన్న మధ్యతరగతి ఔత్సాహిక వేత్తలకు ఇచ్చే రుణాలు, టర్మ్ లోన్లు, డి ఆర్ డి ఏ, మెప్మా, ఎస్సి, ఎస్టీ,బీసీ కార్పొరేషన్ల ద్వారా అందించే తదితర రుణాల గ్రౌండింగ్ విషయంలో నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని, పై అన్ని అంశాలపై బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు వాటిని సాధించాలని కోరారు. గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ద్వారా వివిధ రంగాలలో ఇస్తున్న శిక్షణలో భాగంగా చిరు వ్యాపారాలు నిర్వహించుకునే అతి పేదవారు రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను బ్యాంకర్లు పెద్ద మనసుతో జాప్యం చేయకుండా మంజూరు చేయాలని కోరారు. అలాగే ఆర్ సెటీ సంస్థ శిక్షణ సమయంలోనే శిక్షణ పొందుతున్న వారికి లోన్ కు ఎలా దరఖాస్తు చేసుకోవాలో, ఎలాంటి బ్యాంకులను సంప్రదించాలో తెలియజేయాలని ఆర్ సెటి డైరెక్టర్ ను ఆదేశించారు.ఈ ఆర్థిక సంవత్సరం లో మిగిలిపోయిన వ్యవసాయ రుణాలతోపాటు, ప్రాధాన్యత రంగాలైన గృహ నిర్మాణం, విద్య రుణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ కోరారు. చిన్న ,మధ్య తరహా ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఇచ్చే రుణాల విషయంలో అన్ని బ్యాంకులు వారి లక్ష్యాల సాధనను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, నల్గొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లాంటి బ్యాంకులు విద్యా రుణాలపై దృష్టి సారించాలని, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా అమలు చేసే బ్యాంకు లింకేజీ, మెప్మా ,సెర్ప్, ఎస్సీ ,ఎస్టీ, బీసీ తదితర కార్పొరేషన్ల ద్వారా అమలు చేసే పథకాలపై కూడా బ్యాంకర్లు ఈ నెల 30 లోపు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.పశుసంవర్ధక శాఖ ద్వారా బ్యాంకుల సహకారంతో జారీ చేసే కిసాన్ క్రెడిట్ కార్డులకు ప్రాధాన్యత ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు.వివిధ రుణాల గ్రౌండింగ్ పై ఆయా బ్యాంకులవారీగా జిల్లా కలెక్టర్ కూలంకషంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా శాఖల జిల్లా అధికారులు వారి శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల యూనిట్ల గ్రౌండింగ్, పెండింగ్ ,సమస్యలపై జిల్లా కలెక్టర్ తో పాటు, బ్యాంకర్ల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నాబార్డ్ ఆధ్వర్యంలో 2026 -27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 16,861 కోట్ల రూపాయల తో రూపొందించిన సామర్థ్య ఆధారిత రుణ ప్రణాళిక (పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ 2026- 27) ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఆర్బిఐ ఎల్డిఓ గోమతి, నాబార్డ్ డిడిఎమ్ వినయ్, నల్గొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ శంకర్ రావు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, బ్యాంకుల నియంత్రణ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.




# రోగులకు మెరుగైన సేవలు అందించాలి



- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ ప్రతినిధి,మార్చి 25,తరంగాలు :** ఆసుపత్రి కి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు.బుధవారం వరంగల్‌లోని సీకేఎం ప్రసూతి ఆసుపత్రిని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు.ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ వార్డులను సందర్శించి, రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెను పరిశీలించి, అందులో నమోదైన ఫిర్యాదులను సమీక్షించారు. రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, పౌష్టికాహారం సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా ఆసుపత్రిలో పరిశుభ్రత, ఔషధాల లభ్యత, వైద్య సేవల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అందిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఉమారాణి, జిల్లా వెనుకబడిన వర్గాల అభివృద్ధి అధికారి పుష్పలత, సీకేఎం ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ లక్ష్మీ దేవి, మహాత్మా గాంధీ ఆసుపత్రి వైద్యాధికారి హరిచంద్ర రెడ్డి, వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



THARANGALU DAILY NEWS
గురువారం, 26 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## నల్ల టమాటాల్లో పోషకాల ఖజానా

- ఆంతోసైనిన్స్‌తో శక్తివంతమైన రక్షణ
- గుండెకు మేలు చేసే సహజ ఆహారం
- కంటి చూపు, జీర్ణక్రియకు అద్భుత ప్రయోజనం



**డెస్క్, మార్చి 25 తరంగాలు :(ప్రతినిధి):**
ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో నల్ల చెర్రీ టమాటాలు ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయి. వీటిలో 'ఆంతోసైనిన్స్' అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల శరీరానికి అవసరమైన రక్షణ లభిస్తుంది. ఈ పదార్థాలే టమాటాలకు ముదురు రంగును అందించడమే కాకుండా, కణాల నాశనాన్ని అడ్డుకుని వృద్ధాప్య ప్రభావాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. శరీరాన్ని లోపల నుంచి బలంగా ఉంచే సహజ శక్తి వీటిలో ఉంది. ఇక గుండె ఆరోగ్య పరిరక్షణలో నల్ల టమాటాలు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. వీటిలో ఉన్న లైకోపీన్, పొటాషియం వంటి పోషకాలు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, రక్తపోటును నియంత్రణలో ఉంచడంలో సహాయపడతాయి. దీని వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. సహజమైన ఆహారంతో గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకునే వారికి ఇవి ఉత్తమ ఎంపికగా నిలుస్తాయి. కంటి ఆరోగ్యానికి కూడా నల్ల చెర్రీ టమాటాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. వీటిలోని విటమిన్ ఎ, బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపరచడంలో కీలకంగా పనిచేస్తాయి. నేటి తరంలో ఎక్కువ మంది డిజిటల్ పరికరాల ముందు ఎక్కువ సమయం గడుపుతున్న నేపథ్యంలో కంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో ఈ టమాటాలు కంటి అలసటను తగ్గించి, చూపు స్పష్టతను పెంచడంలో సహాయపడతాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా ఈ టమాటాలు ముందుంటాయి. వీటిలో సమృద్ధిగా ఉండే విటమిన్ సి శరీరానికి అవసరమైన రక్షణను అందిస్తూ, చిన్న చిన్న ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది. గాయాలు త్వరగా మానేందుకు కూడా ఇవి సహాయపడతాయి. శరీరంలో రోగాలతో పోరాడే సామర్థ్యాన్ని పెంచే సహజ ఆహారంగా ఇవి గుర్తింపు పొందుతున్నాయి. జీర్ణక్రియను మెరుగుపరచడంలో, బరువు నియంత్రణలో కూడా నల్ల టమాటాలు కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల మలబద్ధకం వంటి సమస్యలకు ఉపశమనం లభిస్తుంది. అలాగే కేలరీలు తక్కువగా, నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇవి అద్భుతమైన ఆహారంగా నిలుస్తాయి. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకునే ప్రతి ఒక్కరి రోజువారీ ఆహారంలో నల్ల చెర్రీ టమాటాలకు స్థానం ఇవ్వడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## హైదరాబాద్‌లో అకాల వర్షాల హడావిడి

- పలుచోట్ల వడగళ్ల వాన.. ఉష్ణోగ్రతలకు చెక్
- రంగారెడ్డికి రెడ్ అలర్ట్.. పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక
- సాయంత్రం మళ్లీ భారీ వర్షం ప్రారంభం



**హైదరాబాద్, మార్చి 25 తరంగాలు :(ప్రతినిధి):**
హైదరాబాద్ నగరంలో అకాల వర్షాలు కురుస్తూ వాతావరణాన్ని ఒక్కసారిగా మార్చేశాయి. వనస్థలిపురం, హయత్‌నగర్, గాయత్రీనగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో వడగళ్ల వాన పడటంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఎండ వేడిమి నుంచి కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఆకస్మిక వర్షాలతో రహదారులపై నీరు నిలిచిపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తాయి. ఘట్‌కేసర్, అన్నోజిగూడ, నారపల్లి ప్రాంతాల్లో కూడా భారీ వర్షం కురుస్తోంది. మధ్యాహ్నం సమయంలో ప్రారంభమైన వర్షం కొద్దిసేపు తగ్గినా, సాయంత్రం మళ్లీ ఉధృతంగా కురవడం ప్రారంభమైంది. కొన్ని ప్రాంతాల్లో గాలులు కూడా బలంగా వీయడంతో చెట్లు, విద్యుత్ లైన్లకు నష్టం వాటిల్లే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా రంగారెడ్డి జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదే విధంగా నారాయణపేట, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వడగళ్ల వాన కారణంగా కొన్ని ప్రాంతాల్లో పంటలు, వాహనాలు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం.

రహదారులపై నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా సాయంత్రం సమయాల్లో ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారాయి. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీటిమునిగే పరిస్థితులు తలెత్తకుండా డ్రైనేజ్ వ్యవస్థను పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. భారీ వర్షాలు కొనసాగించే అవకాశం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నగరంలో వాతావరణ మార్పులు ఇంకా కొనసాగనున్నాయని అంచనా వేస్తున్నారు.

# అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలి



- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ ప్రతినిధి,25 మార్చి, తరంగాలు :**
అసంపూర్తిగా ఉన్న పనులను మండలాల వారీగా గుర్తించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో ఇంకా అసంపూర్తిగా ఉన్న వాటి పురోగతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో కొన్ని పూర్తికాకుండా ఉండటానికి గల కారణాలను సవివరంగా పరిశీలించారు.పనుల పూర్తి వివరాలను సమగ్రంగా సిద్ధం చేసి రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి పంపించాలని సూచించారు.

ఉపాధి హామీ పనులను వివిధ శాఖల సమన్వయంతో, గ్రామాలలో ప్రజా ప్రతినిధుల సహకారంతో చేపట్టి, రైతులకు అనుకూలంగా ఉండే విధంగా అమలు చేసి వారి ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జి. రామ్ రెడ్డి, సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీవాణి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఇంజినీర్ ఇజ్జగిరి, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, ఎంపీడీవోలు, ఉపాధి హామీ కార్యక్రమానికి సంబంధించిన అధికారులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మిగడ ఫేస్ ప్యాక్.. సహజంగా మెరిసే చర్మానికి సులభ పరిష్కారం



- చర్మానికి తేమను అందించే మిగడ
- సహజ పదార్థాలతో తయారీ
- మృదువైన, మెరిసే చర్మం
- ఇంట్లోనే సులభంగా ఉపయోగం

**డెస్క్, మార్చి 25 తరంగాలు :(ప్రతినిధి):**
సహజసిద్ధమైన అందాన్ని కోరుకునే వారికి మిగడ ఫేస్ ప్యాక్ ఒక ఉత్తమ ఎంపికగా మారుతోంది. పాలు మరిగించిన తర్వాత పైభాగంలో ఏర్పడే మిగడలో సహజ కొవ్వులు, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మానికి తేమను అందించి, పొడిబారిన చర్మాన్ని మృదువుగా మార్చడంలో సహాయపడతాయి. మిగడ ఫేస్ ప్యాక్ తయారు చేయడం చాలా సులభం. ఒక స్పూన్ మిగడలో కొద్దిగా పసుపు, తేనె లేదా నిమ్మరసం కలిపి ముఖంపై అప్లై చేయాలి. 15-20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగితే చర్మం తేలికగా, తాజాగా కనిపిస్తుంది. ఈ ప్యాక్ చర్మాన్ని లోతుగా శుభ్రపరచడంలో సహాయపడుతుంది. మిగడలో ఉన్న పోషకాలు చర్మానికి పోషణ అందించి, ముడతలను తగ్గించడంలో కూడా ఉపయోగపడతాయి. ఇది చర్మాన్ని మృదువుగా చేసి, సహజ కాంతిని పెంచుతుంది. ముఖ్యంగా పొడి చర్మం ఉన్నవారికి ఇది ఎంతో ఉపయోగకరం. క్రమం తప్పకుండా ఉపయోగిస్తే చర్మం ఆరోగ్యంగా మారుతుంది. అయితే, ఆయిల్ స్కిన్ ఉన్నవారు మిగడను ఎక్కువగా ఉపయోగించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే, ఏదైనా అలర్జీ ఉంటే ముందుగా చిన్న భాగంలో పరీక్ష చేసి ఉపయోగించడం మంచిది. సహజంగా అందాన్ని మెరుగుపరుచుకోవాలంటే మిగడ ఫేస్ ప్యాక్ మంచి పరిష్కారంగా నిలుస్తోంది.ంఎ



# టాబ్లెట్ శరీరంలో ఎలా పనిచేస్తుంది?

- మింగిన తర్వాత జరిగే మార్పులు
- రక్తంలోకి చేరి చేసే పని
- జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం

**డెస్క్, మార్చి 25 తరంగాలు :(ప్రతినిధి):**
నేటి జీవనశైలిలో చిన్నపాటి అనారోగ్యానికి కూడా వెంటనే టాబ్లెట్ వేసుకునే అలవాటు చాలామందిలో పెరుగుతోంది. తలనొప్పి, అజీర్తి, జ్వరం, బీపీ, మధుమేహం వంటి సమస్యల కోసం రోజువారీగా మందులు తీసుకుంటున్నారు. అయితే ఈ టాబ్లెట్లు శరీరంలోకి వెళ్లిన తర్వాత ఎలా పనిచేస్తాయి? ఎక్కడ నొప్పి ఉందో వాటికి ఎలా తెలుస్తుంది? అనే సందేహాలు చాలా మందిలో ఉంటాయి. వాస్తవానికి టాబ్లెట్ శరీరంలో ప్రవేశించిన తర్వాత జరిగే ప్రక్రియ చాలా శాస్త్రీయంగా ఉంటుంది. టాబ్లెట్‌ను మింగిన వెంటనే అది గొంతు మార్గం ద్వారా కడుపులోకి చేరుతుంది. కడుపులో ఉన్న ఆమ్లాలు దానిని కరిగించడం ప్రారంభిస్తాయి. కొన్ని మాత్రలు వేగంగా కరిగి వెంటనే పనిచేస్తే, మరికొన్ని ఆలస్యంగా కరిగి నిర్దిష్ట సమయంలో ప్రభావం చూపేలా తయారు చేస్తారు. ఈ దశలోనే టాబ్లెట్‌లోని ఔషధ పదార్థాలు విడుదల కావడం ప్రారంభమవుతుంది.
ఆ తర్వాత చిన్నపేగులో ఈ ఔషధాలు రక్తంలోకి శోషణం చెందుతాయి. ఇది మందు పనిచేయడంలో అత్యంత కీలక దశ. రక్తప్రసరణ ద్వారా ఆ ఔషధాలు శరీరంలోని అన్ని భాగాలకు చేరతాయి. అయితే ఏ అవయవానికి అవసరమో అక్కడే అవి ఎక్కువగా ప్రభావం చూపుతాయి. ఉదాహరణకు నొప్పి నివారణ మందులు నాడీ వ్యవస్థపై పనిచేసి నొప్పిని తగ్గిస్తాయి. యాంటీబయోటిక్స్ అయితే బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. శరీరంలోకి వెళ్లిన మందులు కాలేయంలో రసాయన మార్పులకు గురవుతాయి. దీనిని విఘటన అంటారు. ఈ ప్రక్రియ ద్వారా ఔషధం ప్రభావం నియంత్రితంగా కొనసాగుతుంది. అనంతరం మూత్రపిండాలు, మలవిసర్జన ద్వారా మందుల అవశేషాలు శరీరం నుంచి బయటకు వెళ్లిపోతాయి. దీంతో శరీరం మళ్లీ సహజ స్థితికి చేరుతుంది. మందులు వాడేటప్పుడు కొన్ని ముఖ్యమైన నియమాలు తప్పనిసరిగా పాటించాలి. డాక్టర్ సూచించిన విధంగా సమయానికి మందులు తీసుకోవాలి. ఖాళీ కడుపుతో తీసుకోవాలా లేదా భోజనం తర్వాతా అనే విషయాన్ని గమనించాలి. మందులు వేసుకున్న తర్వాత తగినంత విశ్రాంతి అవసరం. అలాగే కాలేయం, మూత్రపిండాలు సరిగా పనిచేయడం కూడా ముఖ్యమే. ముఖ్యంగా స్వయంగా మందులు వేసుకోవడం ప్రమాదకరం. ప్రతి మందు ఒకేలా పనిచేయదు కాబట్టి వైద్యుల సూచనల ప్రకారం మాత్రమే వాడడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



# డెంగ్యూ నివారణలో ఒంటెల నానోబాడీల ఆశాకిరణం

- **పరిశోధనలో కొత్త మలుపు**
- **వైరస్‌పై సమగ్ర ప్రభావం చూపే సామర్థ్యం**
- **భవిష్యత్తు టీకాలు, చికిత్సలకు మార్గదర్శకం**

**డెస్క్, మార్చి 25 తరంగాలు :(ప్రతినిధి):**
దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్లో డెంగ్యూ ఒకటి కాగా, ప్రతి ఏడాది లక్షలాది మందిని ప్రభావితం చేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం గత కొన్ని దశాబ్దాల్లో ఈ వ్యాధి కేసులు గణనీయంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో మెరుగైన చికిత్సలు, సమర్థవంతమైన టీకాల అభివృద్ధి కోసం ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇలాంటి సమయంలో ఒంటెల శరీరంలో ఉత్పత్తి అయ్యే ప్రత్యేక యాంటీబాడీలు, అంటే నానోబాడీలు డెంగ్యూ వైరస్‌ను నిరోధించే సామర్థ్యం కలిగి ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించడం వైద్య రంగంలో కొత్త ఆశలను కలిగిస్తోంది. పరిశోధకులు గుర్తించిన ఈ నానోబాడీలు డెంగ్యూ వైరస్‌కు చెందిన నాలుగు ప్రధాన రకాలపై ప్రభావవంతంగా పనిచేయగలవని అధ్యయనాలు సూచిస్తున్నాయి. డెంగ్యూ వైరస్ నాలుగు వేర్వేరు రకాలుగా ఉండటం వల్ల ఒక రకానికి వచ్చిన రోగనిరోధక శక్తి మరో రకానికి పనిచేయదు. ఈ కారణంగా సమగ్ర రక్షణ కలిగిన టీకా అభివృద్ధి ఇప్పటివరకు పెద్ద సవాలుగా మారింది. అయితే ఒంటెల నుంచి పొందిన నానోబాడీలు వైరస్ ప్రోటీన్లకు బలంగా కట్టుబడి, ఇన్‌ఫెక్షన్ మార్గాలను అడ్డుకునే సామర్థ్యాన్ని చూపడం ఈ సమస్యకు పరిష్కారంగా మారే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఒంటెల యాంటీబాడీలు నిర్మాణ పరంగా మనుషుల యాంటీబాడీలతో భిన్నంగా ఉంటాయి. ఇవి చిన్న పరిమాణంలో ఉండటంతో పాటు అధిక స్థిరత్వాన్ని కలిగి ఉంటాయి. సాధారణ యాంటీబాడీలు చేరలేని వైరస్ భాగాలను కూడా ఇవి లక్ష్యంగా చేసుకోవడం వీటి ప్రత్యేకత. కఠిన పరిస్థితుల్లో కూడా సమర్థవంతంగా పనిచేయగలగడం వల్ల ఇవి వైద్య పరిశోధనలో ఎంతో విలువైనవిగా గుర్తింపు పొందుతున్నాయి. జీవశాస్త్రంలో అసాధారణ వ్యవస్థలను అధ్యయనం చేయడం ద్వారా వైద్యరంగంలో కొత్త మార్గాలు తెరుచుకుంటాయని ఈ పరిశోధన మరోసారి స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం డెంగ్యూ చికిత్స ప్రధానంగా లక్షణాల నియంత్రణపైనే ఆధారపడి ఉంది. జ్వరం, డీహైడ్రేషన్, రక్తస్రావం వంటి సమస్యలను నియంత్రించడం ద్వారా రోగిని కాపాడే ప్రయత్నం జరుగుతోంది. టీకాలు ఉన్నప్పటికీ అన్ని రకాల వైరస్‌లపై పూర్తి రక్షణ ఇవ్వలేకపోవడం వల్ల కొత్త పరిష్కారాల అవసరం ఏర్పడింది. నానోబాడీలు వైరస్ పెరుగుదల, వ్యాప్తిని అడ్డుకునే విధంగా పనిచేయగలవని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇవి ల్యాబ్‌లలో సులభంగా తయారు చేయగలగడం, అవసరానికి అనుగుణంగా మార్పులు చేయగలగడం వంటి లక్షణాలు భవిష్యత్తులో యాంటీవైరల్ చికిత్సల్లో కీలకంగా మారే అవకాశాన్ని సూచిస్తున్నాయి. ఈ పరిశోధన భవిష్యత్తులో డెంగ్యూ టీకాల అభివృద్ధికి కూడా దోహదపడే అవకాశముంది. నానోబాడీలు గుర్తించిన వైరస్ లక్ష్యాలను ఆధారంగా చేసుకుని మరింత సమర్థవంతమైన టీకాలను రూపొందించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే ఇది ఇంకా ప్రారంభ దశలోనే ఉండటంతో, ల్యాబ్ పరీక్షలు, జంతువులపై ప్రయోగాలు, క్లినికల్ పరీక్షలు వంటి అనేక దశలను పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, భవిష్యత్తులో డెంగ్యూ సహా ఇతర వైరల్ వ్యాధులపై పోరాటంలో ఒంటెల నానోబాడీలు కీలక ఆయుధంగా మారే అవకాశముందని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు.





# పుకార్లు నమ్మొద్దు.. నగరంలో ఇంధన కొరత లేదు: సీపీ సజ్జనర్

- **60 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయని స్పష్టం**
- **అనవసరంగా ఫుల్ ట్యాంకులు చేయించవద్దని సూచన**
- **తప్పుడు ప్రచారాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



**హైదరాబాద్, మార్చి 25 తరంగాలు :(ప్రతినిధి):**
హైదరాబాద్ నగరంలో ఇంధన కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారాలు పూర్తిగా అసత్యమని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ స్పష్టం చేశారు. నగరంలో దాదాపు 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, అనవసరంగా పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనాలకు ఫుల్ ట్యాంకులు చేయించుకోవద్దని సూచించారు. ఇంధన సరఫరాపై వస్తున్న అపోహలను నివృత్తి చేసేందుకు బుధవారం టీజీసీసీసీలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించినట్లు సీపీ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హరిచందన, అదనపు సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ శ్వేతతో పాటు సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు. నగరవ్యాప్తంగా ఇంధన సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని, ఆయిల్ కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రజలు ఒక్కసారిగా బంకులకు చేరుకుని ఇంధనం నింపించుకోవడం వల్ల డిమాండ్ అకస్మాత్తుగా పెరిగి కొన్ని చోట్ల తాత్కాలికంగా 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తున్నాయని సీపీ వివరించారు. అయితే దీనిని అసలు కొరతగా భావించవద్దని, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాల ప్రభావంతో ఈ నెల 22న 3,024 కిలోలీటర్ల ఇంధనం అమ్ముడవగా, 23న అది రెట్టింపై 6,400 కిలోలీటర్లకు చేరుకుందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బాటిళ్లు, డబ్బాల్లో లూజ్ పెట్రోల్ లేదా డీజిల్ విక్రయించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేసి ప్రజల్లో భయాందోళన కలిగించే వారిపై నిఘా ఉంచామని, వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని 240 పెట్రోల్ బంకుల్లో పరిస్థితిని సివిల్ సప్లై, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ నగరంలోని 186 పెట్రోల్ బంకుల్లో ఇంధన సరఫరా సజావుగా కొనసాగుతోందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అవసరమైన చోట్ల వెంటనే సరఫరా పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నిత్యావసర సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉందని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రజలు వాస్తవాలను గుర్తించి సహకరించాలని, పుకార్లను నమ్మి అనవసర ఆందోళనకు గురికాకుండా జాగ్రత్తపడాలని కోరారు. నగరంలో ఇంధన సరఫరా సమృద్ధిగా ఉండడంతో సాధారణ పరిస్థితులు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు.



## రూపాయి డౌన్



**ముంబై, మార్చి 25 తరంగాలు :**
రూపాయి చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే మరో 20 పైసలు కోల్పోయి 93.96 వద్ద ముగిసింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడం, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటం వల్లనే రూపాయికి మరిన్ని చిల్లులు పడ్డాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు తగ్గుముఖం పట్టడం, దేశీయ ఈక్విటీ మార్కెట్లపై సానుకూల ధోరణి రూపాయి పతనానికి అడ్డుకట్ట వేయలేకపోయాయన్నారు. 93.94 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు ఒక దశలో 94.13 స్థాయికి పడిపోయింది.

## పున్నేలు క్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



- **వర్ధన్నపేట యువకుడు అక్కడికక్కడే దుర్మరణం**

**ఐనవోలు, మార్చి 25,తరంగాలు :**
ఐనవోలు మండలం పున్నేలు క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన అరుణ్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, పున్నేలు క్రాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అరుణ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు వరంగల్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న ఐనవోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మాతృత్వం ఒక వరం - చట్టబద్ధమైన దత్తతే శ్రేయస్కరం



**హనుమకొండ ప్రతినిధి, మార్చి 25,తరంగాలు :**
మాతృత్వం ఒక వరమని, దానికి చట్టబద్ధమైన దత్తత మార్గమే శ్రేయస్కరమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. బుధవారం కంచరకుంటలోని మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రత్యేక దత్తత విభాగాన్ని సందర్శించిన కలెక్టర్, కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ నిబంధనల ప్రకారం ఎంపికైన శిశువును హనుమకొండ జిల్లా వడ్డేపల్లికి చెందిన దంపతులకు దత్తతగా అప్పగించారు. ఆ దంపతులు నాలుగు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్నట్లు, సీనియారిటీ ఆధారంగా నాలుగు నెలల శిశువును దత్తతగా అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్రమ దత్తత చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడకూడదని సూచించారు. ప్రతి దత్తత కూడా కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ నిబంధనలకు అనుగుణంగా జరగాలని పేర్కొన్నారు.జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ మాట్లాడుతూ, ప్రత్యేక దత్తత విభాగం ద్వారా 2007 సంవత్సరం నుండి ఇప్పటివరకు దేశీయ దత్తత కింద 220 మంది పిల్లలను, విదేశీ దత్తత కింద అమెరికా, మాల్టా, ఇటలీ, దుబాయి వంటి దేశాలకు 12 మంది పిల్లలను దత్తతగా ఇవ్వడం జరిగినట్లు తెలిపారు. కలెక్టర్ శిశు గృహంలో ఉన్న పిల్లలతో ముచ్చటించి, దత్తతకు అందజేయబడిన శిశువును ఎత్తుకొని ఆప్యాయంగా పలకరించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, ఇంచార్జి జిల్లా శిశు పరిరక్షణ అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. మౌనిక, శిశు గృహ ఇన్‌చార్జి మేనేజర్ అనుముల మాధవి, సోషల్ వర్కర్ సంగి చైతన్య, నర్స్ పుల్ల మౌనిక,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

